AKSHARA TODAY
అక్షర రుటుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in

చిట్టి డబ్బుల కోసం నిరాహార దీక్ష



2



దసరా ఉత్సవాలను విజయవంతం చేయాలి

2

ఆరుగురు వడ్డీ వ్యాపారులపై కేసు నమోదు



అక్షరటుడే,కోటగిరి: మండలంలో ఆరుగురు వడ్డీ వ్యాపారస్తులపై పోలీసులు కేసులు నమోదు చేశారు. ఈ మేరకు ఎస్సై వివరాలు వెల్లడించారు. ఆదివారం పలువురు వ్యాపారుల10మంది ఇళ్లపై మెరుపు దాడులు చేసి రూ.74.50 లక్షల నగదుతో పాటు పలు ప్రామిసరీ నోట్లు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. పోలీసులు స్వాధీనం చేసుకున్న నగదు, ప్రామిసరీ నోట్లను స్టేషన్‌కు తరలించి సంబంధిత వ్యక్తులను విచారించారు. చీటింగ్, మనీ లెండింగ్ చట్టానికి సంబంధించిన కేసులు నమోదు చేసి తదుపరి విచారణ కొనసాగిస్తున్నట్లు కోటగిరి ఎస్సై శ్రీనివాస్ యాదవ్ తెలిపారు.









పుడమిపై పూల సింగిడి




ఉమ్మడి జిల్లాలో సద్దుల బతుకమ్మ వేడుకలను సంబరంగా నిర్వహించారు. తీరొక్క పూలతో బతుకమ్మ పేర్చి కూడళ్లలో పెట్టి ఉత్సాహంగా ఆడారు. బతుకమ్మ పాటలతో పల్లెలు మారుమోగాయి. గ్రామాల్లోని కూడళ్లు పూల సింగిడిని తలపించాయి. అనంతరం బతుకమ్మలను చెరువుల్లో నిమజ్జనం చేశారు. మహిళలకు ఇబ్బందులు కలగకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు. – అక్షరటుడే, నెట్‌వర్క్



ఖిల్లా రామాలయానికి రోప్ వే మంజూరు : ఎమ్మెల్యే ధన్‌పాల్

అక్షరటుడే, ఇందూరు: దశాబ్దాల ఘన చరిత్ర ఉన్న ఇందూరు ఖిల్లా రామాలయానికి రోప్‌వే మంజూరైనట్లు అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ తెలిపారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఛత్రపతి శివాజీ గురువు సమర్థ రామదాసు నిర్మించిన చారిత్రాత్మక కట్టడం ఖిల్లా రామాలయం అన్నారు. ఆలయాన్ని పర్యాటక స్థలంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. సుమారు రూ.35 కోట్ల నిధులతో రోప్‌వే నిర్మాణం కానుందని, ఇందుకోసం డీపీఆర్ సిద్ధం చేస్తున్నారని పేర్కొన్నారు. గతంలో పాలించిన పాలకులు రామాలయ అభివృద్ధిని మరిచారన్నారు. మోదీ ప్రభుత్వం చారిత్రక కట్టడాలపై ప్రత్యేక దృష్టి వహిస్తుందని తెలిపారు. ఇందులో భాగంగానే పర్వతమాల పథకానికి శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్‌తో కలిసి ఖిల్లా రామాలయ అభివృద్ధి కోసం గతంలో కేంద్ర మంత్రుల దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. దీంతో రోప్‌వే మంజూరైనట్లు స్పష్టం చేశారు.



పేదల అత్యవసరాలను ఆసరాగా చేసుకుని అక్రమ వడ్డీ వ్యాపారంతో నిలువునా దోచుకుంటున్న కేటుగాళ్లపై నిజామాబాద్ పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. భారీగా వడ్డీ వసూలు చేస్తూ.. వేధింపులకు పాల్పడుతున్న వ్యాపారులపై దాడులు చేస్తున్నారు. శనివారం పలువురిపై దాడి చేసి, ప్రామిసరీ నోట్లు, నగదు స్వాధీనం చేసుకున్నారు. – అక్షరటుడే, భీమ్‌గల్

- వ్యాపారులపై దాడులు చేస్తున్న పోలీసులు
- పలువురి కేసులు నమోదు
- అక్రమ వడ్డీ వ్యాపారంపై సీపీ సీరియస్..
- భారీగా ప్రామిసరీ నోట్లు స్వాధీనం

వడ్డీ మాఫియాపై ఉక్కుపాదం

జిల్లాలో వడ్డీ వ్యాపారులు రెచ్చిపోతున్నారు. వందకు రూ.3 నుంచి రూ.10 వరకు నెలకు వడ్డీ వసూలు చేస్తున్నారు. కార్లు, బైక్ ఆర్సీలు, ప్లాట్ల పాసుపుస్తకాలు తీసుకొని, తెల్ల కాగితాలపై సంతకాలు, చెక్కులు, ప్రామిసరీ నోట్లను కుదవ పెట్టుకుని దారుణమైన వడ్డీ వసూళ్లకు పాల్పడుతున్నారు. రూ. 2 నుంచి మొదలయ్యే ఈ వడ్డీ భారం కాలక్రమేణా రూ.10 వరకు చేరి బాధితులను ఆర్థికంగా పూర్తిగా దివాలా తీయిస్తోంది. అప్పు తీర్చలేకపోయినా, వడ్డీ కట్టలేకపోయినా రౌడీ మూకలతో ఇళ్లపైకి వెళ్లడం, వేధింపులకు గురిచేయడంతో గతంలో జిల్లాలో పలువురు ఆత్మహత్యలకు పాల్పడిన విషాదకర సంఘటనలు సైతం ఉన్నాయి.

67 ప్రాంతాల్లో దాడులు..

ఈ అక్రమ దందాలపై ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులు, గతంలో వెలువడిన వార్తల నేపథ్యంలో నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య ఆదేశాల మేరకు పోలీసులు రంగంలోకి దిగారు. నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్ల పరిధిలోని అనుమానిత ప్రాంతాలు, వడ్డీ వ్యాపారుల ఇళ్లపై ఏకకాలంలో దాడులు జరిగాయి. కమిషనరేట్ వ్యాప్తంగా మొత్తం 67 ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించగా.. ఏకంగా 42 ప్రాంతాల్లో పెద్ద ఎత్తున చెక్కులు, ప్రామిసరీ నోట్లు, బాండ్ పేపర్లు, నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

చర్యలు తప్పవు

నిబంధనలకు విరుద్ధంగా ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ, అధిక వడ్డీలు వసూలు చేసే వారిని ఉపేక్షించేది లేదని సీపీ సాయి చైతన్య స్పష్టం చేశారు. స్వాధీనం చేసుకున్న ఆధారాల ఆధారంగా విచారణ జరిపి వడ్డీ వ్యాపారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ దాడులతో వడ్డీ వ్యాపారుల్లో ఒక్కసారిగా వణుకు మొదలైంది. సమాజంలో అమాయకుల ప్రాణాలను బలిగొంటున్న ఈ వడ్డీ మాఫియా మూలాలను పూర్తిగా అణచివేయడానికి పోలీసుల ఈ చర్యలు ఎంతవరకు సఫలం అవుతాయో వేచి చూడాల్సిందే.

రియల్ ఎస్టేట్ ముసుగులో..

ఉమ్మడి జిల్లాలో కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు, ఆర్థిక లావాదేవీల ముసుగులో తెరవెనుక భారీగా అక్రమ వడ్డీ వ్యాపారాలను సాగిస్తున్నారు. ఎలాంటి లైసెన్సులు, అనుమతులు లేకుండా ఇష్టానుసారంగా అప్పులు ఇస్తూ అమాయకులను నిండా ముంచేస్తున్నారు. పట్టణాలు, గ్రామాల్లో చిరు వ్యాపారులు, దినసరి కూలీలు, చిరు ఉద్యోగులు తమ అత్యవసరాలు, వ్యాపార విస్తరణ కోసం వీళ్ల బారిన పడుతున్నారు.



తాగునీటి అవసరాలకే తొలి ప్రాధాన్యత : ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ/భీమ్‌గల్ : ఎల్‌నినో ప్రభావంతో జలాశయాల్లో నీటి నిల్వలు తక్కువగా ఉండటంతో తాగునీటి సరఫరాకే తొలి ప్రాధాన్యం ఇస్తామని ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి వెల్లడించారు. భీమ్‌గల్ తహశీల్దార్ కార్యాలయంలో ఆదివారం కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి విలేకరులతో మాట్లాడారు. రైతులకు సుదర్శన్ రెడ్డి పలు సూచనలు చేశారు. వర్షాభావం వల్ల భూగర్భ జలాలు సైతం గణనీయంగా పడిపోతున్నాయని, ముమ్ముందు పంటల సాగుకు సరిపడా విద్యుత్ సరఫరా చేసేందుకు కూడా ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందన్నారు. యాసంగిలో వరి పంట వేయవద్దని రైతులకు విజ్ఞప్తి చేశారు. వరి వేసుకుంటే సాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉన్నందున తక్కువ నీటితో సాగయ్యే కూరగాయలు, పప్పు దినుసు పంటల వైపు దృష్టి సారించాలని హితవు పలికారు. అదనపు కలెక్టర్ భుజంగరావు, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, భీమ్‌గల్ మున్సిపల్ చైర్‌పర్సన్ నాగమణి, సహకార సంఘాల యూనియన్ లిమిటెడ్ మాజీ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజిరెడ్డి పాల్గొన్నారు.





రైల్వే వంతెన ట్రాఫిక్ డైవర్షన్ పనులు దీపావళి వరకు వాయిదా వేయాలి

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: నగరంలో రైల్వే కమాన్ వద్ద వంతెన ట్రాఫిక్ డైవర్షన్ పనులు దీపావళి వరకు వాయిదా వేయాలని మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా డిమాండ్ చేశారు. కమాన్ ప్రాంతాన్ని ఆదివారం సందర్శించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. బతుకమ్మ, దసరా పండుగల వేళ నగరంలోని విజయ్ టాకీస్ పక్కన ఉన్న రైల్వే బ్రిడ్జి విస్తరణ పనులు ప్రారంభిస్తే నగరవాసులకు ఇబ్బందులు తలెత్తుతాయని బిగాల పేర్కొన్నారు. దసరా సందర్భంగా చుట్టుపక్కల గ్రామాల నుంచి, నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో నిజామాబాద్‌కు వచ్చి పండుగ కొనుగోళ్లు చేస్తుంటారని తెలిపారు. ఇప్పటికే నగరంలో ట్రాఫిక్ రద్దీ అధికంగా ఉన్న నేపథ్యంలో కొత్తగా ట్రాఫిక్ ఆంక్షలు విధించడం సరైంది కాదన్నారు. ట్రాఫిక్ డైవర్షన్ కారణంగా వ్యాపారులు, చిరు వ్యాపారులు, వాహనదారులు, పండుగ కొనుగోళ్ల కోసం వచ్చే కుటుంబాలు ఇబ్బందులు పడే పరిస్థితి ఉందన్నారు. పండుగల సమయంలో ప్రజలకు సౌకర్యాలు కల్పించాల్సిన అధికారులు, వారి ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు.

నల్లవెల్లి రైతులకు అండగా ఎమ్మెల్యే.. భూముల రీ సర్వేకు ఆదేశం

అక్షరటుడే, డిచ్‌పల్లి: ఇందల్వాయి మండలం నల్లవెల్లి గ్రామ రైతులకు ఎమ్మెల్యే భూపతిరెడ్డి అండగా నిలిచారు. గ్రామ సమీపంలో రైల్వే ట్రాక్ నిర్మాణం జరుగుతున్న నేపథ్యంలో భూములు కోల్పోతున్న పలువురు రైతులు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. రైల్వే ప్రాజెక్టు కోసం భూములు కోల్పోతున్న రైతుల వివరాలను సంబంధిత అధికారులు పత్రికా ప్రకటనలో తప్పుగా ప్రచురించారని, వాస్తవానికి తమకు ఎక్కువ భూమి ఉన్నప్పటికీ తక్కువ విస్తీర్ణాన్ని నమోదు చేశారని రైతులు వివరించారు. ఈ తప్పిదం వల్ల తమకు రావాల్సిన నష్టపరిహారం తగ్గిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తూ న్యాయం చేయాలని కోరారు. రైతుల విజ్ఞప్తిపై తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే దా. ఆర్.భూపతి రెడ్డి ఆర్డీవోతో ఫోన్‌లో మాట్లాడారు. భూములు కోల్పోతున్న రైతుల వివరాలను క్షేత్రస్థాయిలో మరోసారి పరిశీలించి రీసర్వే నిర్వహించాలని, భూముల వాస్తవ విస్తీర్ణాన్ని నిర్ధారించి అర్హులైన రైతులకు న్యాయంగా, తగిన పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.









బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో..

రంగురంగుల బతుకమ్మలతో మహిళలు, చిన్నారుల సంబరాలు అంబరాన్నంటాయి. బతుకమ్మ పాటలతో పల్లెలు, పట్టణాలు మార్మోగాయి. లయబద్ధంగా వచ్చే పాటలకు నృత్యాలు చేస్తూ మహిళలు సందడి చేశారు. ఆయా ప్రాంతాల్లో అధికారులు, సిబ్బంది బతుకమ్మ నిమజ్జనానికి ఏర్పాట్లు చేశారు.


























వాహనదారులు అప్రమత్తంగా ఉండాలి: ట్రాఫిక్ సీఐ సురేష్‌కుమార్



అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: పండగ నేపథ్యంలో వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని ట్రాఫిక్ సీఐ సురేష్ కుమార్ సూచించారు. నగర ట్రాఫిక్ సీఐగా ఆయన బాధ్యతలు స్వీకరించారు. దసరా పండగ సందర్భంగా నగరంలోని ప్రధాన మార్కెట్లలో సందడి వాతావరణం నెలకొందని సీఐ తెలిపారు. ఈ నేపథ్యంలో దొంగలు వాహనాలు చోరీ చేసే అవకాశం ఉందన్నారు. దీనికోసం వాహనదారులు సీసీ కెమెరాలు ఉన్న ప్రాంతంలోనే బైకులు ఇతర వాహనాలు పార్క్ చేయాలని సూచించారు. అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అయితే ట్రాఫిక్ సీఐగా బాధ్యతలు స్వీకరించిన సురేష్ కుమార్ గతంలో నిజామాబాద్‌లోనే సౌత్ రూరల్, మోపాల్ సీఐగా పనిచేశారు.

భీమ్‌గల్ చాయ్‌వాలా కుటుంబానికి ఆర్థికసాయం



అక్షరటుడే, నిజామాబాద్ సిటీ : భీమ్‌గల్ మండల కేంద్రంలో ఇటీవల సుధాకర్ (60) అనే వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరపున రూ.5 లక్షల ఆర్థిక సహాయం ప్రకటించగా.. ప్రభుత్వ సలహాదారు సుదర్శన్‌రెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆధ్వర్యంలో బాధితులకు చెక్కు అందించారు. భీమ్‌గల్ తహశీల్దార్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మృతుడి భార్య సరోజ, కుమారుడు శ్రీనివాస్‌లతో సుదర్శన్‌రెడ్డి మాట్లాడారు. బాధిత కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని ప్రకటించారు. అదనపు కలెక్టర్ భుజంగరావు, తాహెర్ బిన్ హందాన్, మున్సిపల్ చైర్‌పర్సన్ నాగమణి ఉన్నారు.

దేవీ నవరాత్రి ఉత్సవాలకు రూ.50 వేల విరాళం

అక్షరటుడే, ఆర్మూర్: ఆర్మూర్ మండలం ఇస్సాపల్లి గ్రామంలో మహమ్మద్ మహబూబ్ తన ఉదారతను చాటుకున్నారు. గ్రామంలో నిర్వహిస్తున్న దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అన్నదాన నిర్వహణ కోసం రూ.50 వేల విరాళాన్ని అందజేశారు. పండుగలు, ఉత్సవాలు మతాలకు అతీతంగా ప్రజలను ఏకం చేస్తాయని చాటిచెప్పేలా ఆయన సహకారం అందించారు. దేవీ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అమ్మ వారి దర్శనానికి వచ్చే భక్తులకు అన్నప్రసాదం అందించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు.



ఆరో రోజుకు చేరిన ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమ్మె



అక్షరటుడే, కామారెడ్డి: జిల్లా వైద్య ఆరోగ్యశాఖలోని జాతీయ ఆరోగ్య మిషన్ లో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ విధానంలో పని చేస్తున్న ఉద్యోగుల నిరవధిక సమ్మె ఆరో రోజుకు చేరింది. ఎన్ హెచ్ఎం జేఏసీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ముందు ఆదివారం ఉద్యోగులు మౌన దీక్ష చేపట్టి నోటికి నల్లని రిబ్బన్ ధరించారు. ఉద్యోగులు మాట్లాడుతూ.. ప్రభుత్వానికి తమ డిమాండ్లపై విన్నవించామని, ఇక నిర్ణయం తీసుకోవాల్సింది ప్రభుత్వమేనని, అందుకనే ఈరోజు తాము మౌనంగా ఉన్నామని నిరసన వ్యక్తం చేశారు. సద్దుల బతుకమ్మ పండుగను సైతం లెక్కచేయకుండా మహిళా ఉద్యోగులు నేడు నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఎం జేఏసీ జిల్లా అధ్యక్షుడు తాళ్లపల్లి సుమన్, బట్టు పద్మజ, వెంకటరమణ, మీనాక్షి, సుధాకర్, రవళి, రాహుల్, రాజశేఖర్, అఖిల్, రంజిత్ పాల్గొన్నారు.

శ్రీరామ కాలనీ ఓపెన్ జిమ్‌లో స్వచ్ఛభారత్



అక్షరటుడే, ఆర్మూర్: ఆర్మూర్ మున్సిపాలిటీ పరిధిలో పెర్కిట్ శ్రీరామ కాలనీలోని ఓపెన్ జిమ్‌లో ఆదివారం మహాత్మా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో 76వ స్వచ్ఛ భారత్ నిర్వహించారు. జిమ్ ఆవరణలో చెత్త చెదారాన్ని తొలగించి శుభ్రం చేశారు. పెరిగిన చెట్ల కొమ్మలు, పిచ్చిమొక్కలు, చెత్త చెదారాన్ని తొలగించారు. ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్ ఈరవత్రి రాజశేఖర్ మాట్లాడుతూ.. తన కాలనీలో ఉన్న ఓపెన్ జిమ్ ఆవరణలో ఉన్న చెత్తా చదరాన్ని తొలగించడం సంతోషకరమన్నారు. ఇలాంటి స్వచ్ఛంద కార్యక్రమాలు చేపడుతున్న మహాత్మ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడిని అభినందించారు. ఆర్మూర్ మహాత్మ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సుంకె శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రతి ఆదివారం ఒక గంట నినాదంతో నిర్వహిస్తున్న ఈ స్వచ్ఛ కార్యక్రమంలో భాగంగా 76వ ఆదివారం పెర్కిట్ శ్రీరామ కాలనీ ఓపెన్ జిమ్‌లో ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. బి ప్రశాంత్, రమేష్, రాజ్ కుమార్, గణేష్, సుంకే నిశాంత్, యాదగిరి, ఆదిత్య, నటరాజ్ గౌడ్ పాల్గొన్నారు.

చిట్టి డబ్బుల కోసం నిరాహార దీక్ష



అక్షరటుడే, కామారెడ్డి : తనకు రావాల్సిన చిట్టి డబ్బులను ఇవ్వడం లేదని ఆరోపిస్తూ ఓ బాధితుడు ఆమరణ నిరాహార దీక్షకు దిగాడు. కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని అడ్లూర్ గ్రామంలో అంబేద్కర్ విగ్రహం వద్ద ఈ ఘటన ఆదివారం చోటుచేసుకుంది. బీబీపేట మండలం జనగామ గ్రామానికి చెందిన సుక్కన్నగారి సంతోష్ కుమార్ ప్రస్తుతం కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని దేవునిపల్లి గ్రామంలో ఉంటున్నాడు. గతంలో ఉన్న పరిచయాలతో అడ్లూర్ గ్రామానికి చెందిన బాలూరి ప్రతాప్ వద్ద రూ.5 లక్షల చిట్టి వేశాడు. చిట్టి చివరిలో రూ.5 లక్షలు రావాల్సి ఉండగా ఇవ్వడం లేదని ఆరోపిస్తున్నాడు. సదరు చిట్టి ఇచ్చే వ్యక్తి ప్రతాప్ అప్పుడప్పుడు కలిపి రూ.70వేల వరకు మాత్రమే చెల్లించాడని, మిగతా రూ.4.30 లక్షలు ఇంకా రావాల్సి ఉందని సంతోష్ కుమార్ తెలిపాడు. 18 నెలలుగా డబ్బులు ఇవ్వకపోవడంతో గత ఆగస్ట్ 3న చిట్టి డబ్బుల కోసం ప్రతాప్ ఇంటికి వెళ్లి అడిగితే ఇవ్వలేదని, చెక్కులు ఇవ్వాలని కోరినా ఇవ్వనని చెప్పాడని సంతోష్ కుమార్ తెలిపాడు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేయడానికి తిరిగినా పట్టించుకోలేదని సంతోష్ చెప్పాడు. ప్రతాప్‌ను ఫోన్ ద్వారా వివరణ కోరగా తాను సంతోష్‌కు ఎలాంటి డబ్బులు ఇచ్చేది లేదన్నారు.

దసరా ఉత్సవాలను విజయవంతం చేయాలి



అక్షరటుడే, కామారెడ్డి: జిల్లా కేంద్రంలోని ఇందిరా గాంధీ స్టేడియంలో షబ్బీర్ అలీ ఫౌండేషన్, దసరా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న దసరా ఉత్సవాలను విజయవంతం చేయాలని మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి కోరారు. ఆదివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. విజయదశమి అంటేనే చెడుపై మంచి విజయం సాధించడమని, అలాగే ప్రజలందరూ శాంతియుతంగా కలిసిమెలిసి ఐక్యంగా ఉన్నప్పుడే సమసమాజం శాంతిభద్రతలతో, ధర్మ పరిరక్షణలో, అభివృద్ధి పథంతో ముందుకెళ్తుందని ఆకాంక్షించారు. ఉత్సవాలకు భారీ సంఖ్యలో ప్రజలు హాజరయ్యే అవకాశం ఉందని, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ సూచనల మేరకు తాగునీటి సదుపాయం, భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ ఉత్సవం విజయవంతం కోసం అన్ని శాఖల అధికారులతో సమన్వయంతో పనిచేస్తున్నామని తెలిపారు. లేజర్ షో, పెద్ద ఎత్తున క్రాకర్స్ తో కార్యక్రమం ఉంటుందని, ఈ ఉత్సవాలను తిలకించడానికి కుటుంబసమేతంగా విచ్చేసి కార్యక్రమాన్ని తిలకించాలని, ఉత్సవాలకు వచ్చే ప్రజలు ట్రాఫిక్ దృష్ట్యా పోలీస్ శాఖ వారికి సహకరించాలని కోరారు.